ప్రేమ లేనట్టి మనసది ప్రేత భూమి
అనగ నొప్పారు నిజముగ అవనియందు
శ్వాస నిశ్వాసములు రెండు జరుగుచుండు
కొలిమి తిత్తికి పోలమని నుడువదగున!

ప్రేమస్వరూపులారా!

ప్రేమ యొక్క లక్షణము త్యాగము. ప్రేమ దేనిని కోరదు. ప్రేమ ఎవరిని దూషించదు. ప్రేమ ఎవరిని బాధించదు. ప్రేమ నిస్వార్థము, నిర్మలము. ఇట్టి ప్రేమ తత్వము మానవుడు గుర్తించుకొనలేక అనేకవిధములుగా ప్రేమకై పరితపిస్తున్నాడు. ప్రేమ అనగా నిస్వార్థము త్యాగముతో కూడిన తత్త్వమని మనము విశ్వసించాలి. ఈ విశాల ప్రపంచమందు తల్లి బిడ్డల ప్రేమగాని భార్య భర్తల ప్రేమగాని, అన్నదమ్ముల ప్రేమగాని మిత్రుల ప్రేమగాని అన్ని ప్రేమలయందు అంతో ఇంతో స్వార్థము స్వప్రయోజనము ఉంటున్నది. ఎట్టి స్వార్థ స్వప్రయోజనములు లేని ప్రేమ దైవప్రేమ. ఈ ప్రేమ అత్యంత దూరముగానున్న వారిని కూడా సన్నిహితము గావిస్తుంది. వియోగులను సంయోగులుగా గావిస్తుంది. పశు ప్రవర్తనలో మునిగిన మానవుని పశుపతిగా మారుస్తుంది. లౌకిక, భౌతిక, లోక సంబంధమైన ప్రేమలను క్రమక్రమేణా దివ్యమైన ప్రేమగా మారుస్తుంది. ఈ ప్రేమ తత్వమును తెలుసుకోగోరు భక్తులు స్వార్థ స్వప్రయోజనాన్ని త్యాగము చేయాలి. కనుక భగవత్ప్రేమ గుర్తించగోరేవారు దివ్యమైన తత్వమును అభివృద్ధి పరచుకోవాలి. నిశ్చలత్వము, నిర్మలత్వము అభివృద్ధి గావించుకోవాలి. ఎన్ని కష్టములు అడ్డు తగిలినా ఎన్ని విధములైన బాధలు మనము అనుభవించినప్పటికి లెక్కచేయక దైవ ప్రేమను మాత్రమే దృష్టియందుంచుకొని జీవించుటకు ప్రయత్నించాలి. విశ్వమానవ భ్రాతృత్వము కూడా ఏకత్వము కానేరదు. brotherhood of man. ఇందులో కూడా స్వార్థముంది. ఇందులో కూడా స్వప్రయోజనము ఉంటున్నది. కనుక విశ్వమానవ సౌభ్రాతృత్వము అభివృద్ధి పరచుకొనేవారు ఏకాత్మ తత్వము విశ్వసించాలి. అన్నదమ్ములందు అనేక భేదాభిప్రాయములు అభివృద్ధియై అనేక కలతలలో కల్లోలములలో మునిగి అనేక చిక్కులకు గురౌతువచ్చారు. కనుక ఈ భ్రాతృత్వము నిజమైన ప్రేమ కానేరదు.

నాయందు నీయందు వారియందు వీరియందు ఉన్న ఆత్మ ఒక్కటేయని ఏకాత్మ తత్వాన్ని పొందటమె ప్రేమ యొక్క స్వరూపము. వ్యక్తులు వేరు కావచ్చు, రూపనామములు వేరుకావచ్చు కానీ అందరియందున్న ఆత్మ తత్వము ఒక్కటే. ప్రతి విషయమందు ఏకాత్మ తత్వమును గుర్తించుటకు ప్రయత్నించాలి.

శృంగారములు వేరు బంగారమొక్కటే
పశుల వన్నెలు వేరు పాలు ఒకటె
జీవజంతులు వేరు జీవుండు ఒక్కడే
పూల జాతులు వేరు పూజ ఒకటె

అన్నింటి యందు మనము ఏకత్వము భావించాలి. ఈ ఏకత్వము మనము గుర్తించినప్పుడు పరిపూర్ణ ప్రేమ తత్వము మనము గుర్తించటానికి వీలవుతుంది. మన హృదయము నిండుకు ప్రేమయె నింపుకోవాలి. కేవలము హృదయమందు కల్మష భావములు నింపుకొని పైపైన ప్రేమగా నటించటము మనకు మనమే ద్రోహము చేసుకొన్నవారమవుతాము.

ప్రేమ కలిగిన వ్యక్తి ఎట్టి ప్రదేశము నందైనా ఎట్టి పరిస్థితి యందైనా, ఎట్టి కర్మలందైనా ఈ ప్రేమ తత్వము ఏమాత్రము విడువడు. అనేకమంది విద్యార్థులు హాస్టలులో నున్నంతవరకు ఇన్స్టిట్యూట్ లో చదివేంతవరకు చాలా నిర్మలంగా, పరిశుద్ధమైన ప్రేమతో ఉంటుంటారు. బయట ప్రపంచములో పోయి ప్రవేశించేటప్పటికి సహవాస దోషము చేత, పరివారము చేత, కొన్ని సంఘటనల చేత అనేక విధములుగా మనసు మారుతున్నాదని చెప్పుకుంటూ ఉంటారు. ఇది సరైన జవాబు కాదు. నిజముగా నీ హృదయమందు నిర్మలమైన, నిశ్చలమైన, నిస్వార్థమైన ప్రేమయే ఉండినప్పుడు ఎక్కడకు వెళ్ళినా ఇది మార్పు చెందుటకు వీలు లేదు. ఎట్టి సంఘము కూడా నిన్ను మార్చుటకు వీలుకాదు. దీనికి చక్కని దృష్టాంతము. ఒక పేపరుంటున్నాది. పేపరుపైన పూల తీగ వ్రాసాము ఆ పూల తీగలోపల అనేక పుష్పములుండినట్లుగా గుర్తింప చేస్తున్నాము. కాని బయట గాలి ఎంత వీచినా కాగితము ఆడుతుంది గాని అవ్రాసిన పూల తీగ ఏమాత్రము అల్లాడదు. అదే విధముగా నీ మనస్సు సంఘ దోషముచే అటు ఇటు కొంచెము కదిలినప్పటికి హృదయము మాత్రము స్థిరముగా ఉంటుంది. నీ హృదయములో నున్న ప్రేమ తత్వమును ఎవరు మార్చుటకు వీలుకాదు. ప్రేమ మనస్సులో కాదు నింపుకోవలసింది. హృదయములో నింపుకోవాలి. మనస్సు కేవలము సంకల్ప

మలతో సమ్మిళితమైన స్వరూపమే. ఈ సంకల్పముల చేత వచ్చినది సంకల్పముల చేతనే పోతుంది. కనుక హృదయములోపల పవిత్రమైన భావములను ప్రేమ తత్త్వమును భద్రపరచుకోవాలి.

ఈ ప్రేమ త్రికోణ స్వరూపకంగా ఉంటుంది. ఒక కోణము తాను ఎవ్వరికి భయపడదు. ప్రేమకు భయమే లేదు. ప్రేమ మరొకరిని భిక్ష చేయదు. ప్రేమ ప్రేమ నిమిత్తమై ప్రేమిస్తుందిగానీ మరొక పదార్థ నిమిత్తమై కాదు. ప్రేమ నిర్భయముగా ఉంటుంది. ప్రేమ పరులను భిక్ష చేయదు. ఈ మూడు గుణములు ప్రేమకు ప్రధానమైన ప్రాణము. ఇట్టి పవిత్రమైన ప్రేమ తత్త్వమే నిజమైన ప్రేమ. ఒకానొక సమయంలో ఒక రాజు వేటకై అడవికి వెళ్ళాడు. వేటాడి అలసిపోయాడు. దాహము వేసింది. కొంత దూరంలో చిన్న కుటీరం కనిపించింది. అక్కడ ఎవరైనా ఉంటారని అక్కడ తాను ప్రవేశించాడు. అక్కడ ఒక మహనీయుడు ధ్యానములో నిమగ్నమైనాడు. రాజు అతని సాధనను భంగపరచలేదు. అక్కడనే కూర్చున్నాడు రాజు. ఆ మహనీయుడు ధ్యానము నుండి లేచి 'ఎవరండి మీరు ఎందుకు వచ్చారని' క్షేమ సమాచారములు అడిగాడు. 'నేను ఒక దేశపు రాజును. వేటాడే నిమిత్తమై అరణ్యములో ప్రవేశించాను. అలసి పోయాను. ఈ కుటీరము చూచి ఇందులో కొంత విశ్రాంతి పొందుకోవాలని వచ్చాను.' అనేటప్పటికి ఆ మహర్షి మహదానందములో తాను తెచ్చిపెట్టుకున్న కందమూలములు, చల్లటి నీరు రాజునకందించాడు. దానిని చక్కగా అనుభవించి మహారాజు సంతోషించాడు. తిరిగి వెళ్ళే సమయములో మహనీయుని ప్రార్థించాడు మహారాజు. స్వామి! అతి సమీపములోనే మా రాజ్యము ఉంటున్నది. తాము ఇంత ఉపకారము చేసినందుకు నా వెంట వచ్చి ఆతిథ్యము తీసుకోమన్నాడు. కాని సర్వసంగ పరిత్యాగియైన ఈ మహనీయుడు దీనికి ఏమాత్రము అంగీకరించలేదు. కాని రాజు చాలా బలవంతపరిచాడు. రాజుని సంతృప్తిపరచాలనే ఉద్దేశ్యముతో రాజు వెంట వచ్చాడు. వచ్చిన తక్షణమే ఇరువురు స్నానము చేశారు. రాజు గృహములో పూజకై వెళ్ళాడు. అతని వెంటనే ఈ మహనీయుడు కూడా పూజ గదిలోకి వెళ్ళాడు. రాజు ప్రార్థన చేస్తున్నాడు. 'దేవాది దేవా! ఈనాటికి అదృష్టవశాత్తు రాజునయ్యాను. కాని ఈ చిన్న రాజ్యము నాకు చాలదు. నా రాజ్యము ఇంకను వ్యాపింప చేసుకోవాలి. ఇంకా అనేక చిన్న చిన్న రాజ్యములను ప్రవేశపెట్టుకోవాలి. కటాక్షించి నీవైన అనుగ్రహమును ప్రసాదించమన్నాడు. ఈ మాటలు వింటున్న మహనీయుడు మహారాజుకు చెప్పకుండా లేచి వెళ్ళిపోతున్నాడు. 'స్వామి! భుజించక పూర్వమే వెడుతున్నారా! కొంత సేపాగండి.' అన్నాడు మహారాజు. 'అయ్యా! నేను భిక్షగాని దగ్గర భిక్షము ఎత్తుటానికి రాలేదు. నేను

ఒక బిచ్చగానిగా ఉంటున్నావు. నీవు ఏమేమో కావాలని భగవంతుని ప్రార్థిస్తున్నావు. భగవంతుని దగ్గర
విశాలమైన రాజ్యము కావాలని ఆశిస్తున్నావు. నీవు ఏ భగవంతుని కోరుతున్నావో ఆ భగవంతునే నేను
కోరుకుంటాను. నీ దగ్గర నాకు ఏ ఆహారము అక్కరలేదు'. అన్నాడు. అనగా నిజమైన ప్రేమ భగవంతు
నిపై గలవాడు beg చేయడు.

భగవంతుని ఏదీ అడగనక్కరలేదు. సకాలమునకు ఏది కావాలో అన్నీ అందిస్తుం
టాడు. రామాయణము నందు

అడుగకుమే ఓ మనసా అడుగకుమే ఓ మనసా
అడుగు కాలది అది అడుగున పడునని
అడగకున్న పని వడిగా నగునని ॥అడు॥
అడుగని శబరిని ఆదరించడే
అడుగక ఏనక్కై మడుగు జటాయువు
కడు నేగి సద్గతి కలిగించడే ॥అడు॥

శబరి అడిగిందా! జటాయువు కోరిందా! హృదయంలో నిర్మలంగా నిశ్చలంగా పరిపూర్ణ ప్రేమతో పిల
చినప్పుడు తానే పరుగెత్తి వస్తుంటాడు. ఏదీ మనము నోరుతెరచి అడగనక్కరలేదు. ఇది భగవంతుని
యొక్క ప్రేమకు గుర్తు. భగవంతుని ప్రేమ యొక్క విలువ. ఇట్టి భగవత్తత్వము మనము విస్మరించి లౌకి
కత్వాన్ని అనుసరించటంచేత ఇన్ని విధములైన అశాంతికి గురైపోతున్నాము. అడుక్కోటం, ప్రార్థించటము
ఇవన్నీ ప్రాకృత ధర్మములు. ఇవి ప్రవృత్తి ధర్మములు. ఈ పవిత్రమైన ప్రేమ తత్వము నివృత్తి ధర్మము.
నివృత్తి తత్వమునను మనం పూనుకున్నప్పుడు ప్రవృత్తులన్నీ పారిపోతాయి. భగవంతుని ఖజానాలోపల
ఎంత విలువైనవి ఉంటున్నాయో ఎవరికి తెలియదు. ఏదో నీవు గాజు ముక్కకై ప్రార్థిస్తే మాణిక్యమునే
అందిస్తాడు. భగవంతుడు ఎంత విలువైన దానిని ఇవ్వాలనుకున్నాడో మనకు తెలియదు. అల్పమైనదాని
నీవు అడుగుతున్నావు. అధికమైన దానిని ఇవ్వటానికి సంకల్పించుకున్నాడు. అన్నింటిని భగవత్సంకల్ప
ముపై మనము వదలాలి. అప్పుడే అవసరమైనవి తాను అందిస్తాడు. ఏది నీకు అవసరమో, ఏది నీకు అనవస
రమో, ఏది నీకు మంచిదో ఏది నీకు చెడ్డదో నీకు తెలియదు. నీకు మంచి అయినదానిని, నీకు అనుకూల
మైనదానిని, ఆదర్శవంతమైనదానిని తానే అందిస్తాడు. ఏ నిమిషములో ఎప్పుడు ఎక్కడ ఏ విధముగా అంది
స్తాడో అది అతని సంకల్పమే. అన్నింటిని భగవంతునికి అర్పితముగా చూచి భగవత్ప్రసాదముగా భావించ నిశ్చల

మనస్సుతో నుండినప్పుడు సర్వము తానే ఆచరించుకుంటాడు.

కాని అంతటి విశ్వాసము ఈ నాటి మానవులందు లేదు. ఈ విశ్వాసము లేకపోవటం చేత ఎన్నివిధములైన సంకల్పములతో తాను భంగపరచుకుంటున్నాడు. అన్నింటికి విశ్వాసము చాలా ప్రధానము. భక్తి విశ్వాసము మనము పోల్చుకుంటూ వచ్చాము. భక్తి అనగా ప్రేమ విశ్వాసమనగా నమ్మకము. ప్రేమపై నమ్మకము ఉండాలి. ఈ నాడు మన ప్రేమపై మనకే నమ్మకము లేదు. ఇంక దైవముపై ప్రేమ ఎట్లా వస్తుంది. నీ ప్రేమ ప్రాకృతమైనది. కాని భగవంతుని ప్రేమ నిర్మలమైనది. ప్రాకృతము నకలతమైనది. అది ఒక పరిమితము లేని ప్రేమ. ఇంతటి ప్రేమ తత్వము రావాలంటే ఈ లౌకికమైన ప్రేమ క్రమక్రమేణా వర్ధించుకుంటూ రావాలి. పిల్లలున్నారు. పరీక్షలు ప్రారంభమవుతే ప్రార్థనలు అధికమైపోతాయి. ప్రార్థనలంతా దేని నిమిత్తమై? పరీక్షల కోసమని. కాదు. కాదు. అది సరైన ప్రార్థన కాదు. అది beggar చేసే పద్ధతి ఉంది. నీవు beggarలు కాకూడదు. నీవు beggarలు. భక్తుడు ఈ విధమైన దానిలో ప్రవేశించకూడదు. వివిధమైన వాంఛలు లేక భగవంతునే వాంఛించినప్పుడు అన్నీ తానే అనుగ్రహిస్తాడు. అయితే అంతటి ఉన్నతస్థాయి లేకపోవటంచేత ప్రారంభస్థితిలో మనము కొన్ని కొన్ని కోరక తప్పదు. అడుగక అమ్మ అయినా బువ్వపెట్టదట. కాని అమ్మ ప్రాకృతమైన సంబంధము. Divine mother ప్రాకృత సంబంధము కాదు. నివృత్తి సంబంధమైన mother. ప్రవృత్తికి అడుక్కోటము, తీసుకోటము, అనుభవించటము ఇవన్నీ సహజము. నివృత్తి సంబంధమైన ఆనందములో అనుభవించటమే తప్ప అడుక్కోటమే లేదు. ఏది చేసినా అందుకో. ఏది ఇచ్చినా అందుకో. మంచా చెడ్డా అనే discrimination చేయవద్దు. నీ దృష్టిలో చెడ్డగా కనిపించవచ్చు. కాని అది ఒక మంచిగా ఉండవచ్చు. మలేరియా జ్వరము వచ్చిన వానికి డాక్టరు క్వినైన్ మిక్చరు ఇస్తాడు. ఈ క్వినైన్ చేదుగా ఉంటుంది. మందు చేదుగా ఉంటున్నదిగాని మందు మహాత్మ్యము గొప్పగా ఉంటున్నది. అది నీకు సంభవించిన రోగమును నివారణగా చేస్తుంది. ప్రారంభములో భక్తి కష్టముగా ఉంటుంది. కాని ఈ కష్టమునకు మనము ఏమాత్రము వెరవకూడదు. ఈ కష్టమునను మనము ఏమాత్రము వదలకూడదు. అనేక మంది మహనీయులు అనేక కష్టములకు, శ్రమలకు ఓర్చి అద్వితీయమైన ఫలాన్ని పొందే నిమిత్తమై చాలా దీర్ఘమైన తపస్సులాచరించారు. రెండు బాధల మధ్యలోనే సుఖము ఉంటున్నది. బాధలు లేక సుఖము ప్రాప్తించదు. ఈ బాధలవలనే మనకు సుఖము ప్రాప్తిస్తుంది. 'పిలచి ఆడుగపెట్టినా బిల్లరాయి పిప్పిగాట్టి రసము పిల్చుకున్న ఒక వజ్రమును అనేక కోతలు కోసినప్పుడే దానికి సరైన విలువ లభిస్తుంది. ఆ cuttings చేయకపోయిన సరైన విలువ

రాదు. బంగారును నిప్పులో వేసి కాల్చి సుత్తితో కొడితే, అప్పుడే సుందరమైన నగగా తయారౌతుంది. మానవత్వములో మనము కొన్ని కష్టములకోర్చుకొని, బాధలను సహించి, నిందలకు నిష్ఠూరములకు ఏమాత్రము లెక్క చేయక దివ్యమైన ప్రేమ అభివృద్ధి పరచుకున్నామంటే దానిలోనే దివ్యానందము మనకు ప్రాప్తిస్తుంది.

భగవత్ప్రేమ చులకనగా మనం భావించరాదు. అది చాలా పవిత్రమైనది. చూచేందుకు చాలా చిన్నదిగా ఉండవచ్చు. అనుభవించుటకు లోకసంబంధమైనదిగా ఉండవచ్చు. కాని అది లోకాతీతమైన తత్త్వము. అలాంటి ప్రేమ తత్త్వము ప్రతి మానవుడు పొందాలి. నిన్న చెప్పాను. ఆత్మను పుట్టినది అహం. అహంకు పుట్టినది మనస్సు. మనస్సుకు పుట్టినది వాక్కు. కాబట్టి వాక్కు మనస్సు బిడ్డ. మనసు అహం బిడ్డ. అహం ఆత్మ బిడ్డ. కాబట్టి ఆత్మకు అహం son. వాక్కు grandson. Father, son, grandson, great grand son ఈ నల్గురు ఆత్మ సంబంధమే. అందరియందు ఆత్మ ఉంది కనుక అదే నిజమైన ప్రేమ తత్త్వము. ఏమీ లేని వ్యక్తి ఉండవచ్చుగాని ఆత్మలేని వ్యక్తి లేడు. సర్వులయందు ఉన్న ఏకత్వము విభూతి? అదే సత్ చిత్ ఆనందము. అదే మనము conscience అన్నాము. మనచుట్టూ ఉన్న గాలినే మనము చూడలేక పోతున్నాము. మనచుట్టూ ఉన్న గాలినే మనం పట్టలేక పోతున్నాము. అయితే చూడలేకుండా పోయినంత మాత్రమున గాలి లేదా? నీవు పట్టలేకుండా పోయినంత మాత్రమున గాలి లేదా? ఉన్నది. అదే విధముగా నీవు చూడలేకుండా ఉన్నంత మాత్రమున ఈ చైతన్యము లేక పోలేదు. నీవు అనుభవించలేక పోయినంత మాత్రమున చైతన్యము లేక పోలేదు. ఉన్నది. దానినే being అన్నారు. ఈ being నే సత్ అన్నారు. అనగా ఎప్పటికి ఉండేదే. వచ్చిపోయేది కాదు. రాకపోకలు లేని దివ్యత్వము ఈ సత్. ఇట్టి తత్త్వము ఎక్కడినుంచో వచ్చింది ఎక్కడికో వెళ్ళింది అని అనుకోటం చాలా పొరపాటు. నేను ధ్యానములో ఉంటే భగవంతుడు వచ్చి దర్శనమిచ్చాడు అనుకుంటారు. ఇది ప్రాకృత భావము. ఎక్కడనుంచి వచ్చాడు దర్శనమీయటానికి. ఎక్కడనుంచో రాలేదు. దర్శనమిచ్చి తిరిగి ఎక్కడికో పోలేదు. ఇక్కడే ఉన్నాడు. నీ హృదయము పవిత్రమైనప్పుడు కనిపించాడు. తిరిగి మాలిన్యమైనప్పుడు కనిపించకుండా పోయాడు. అంతేగాని రావటం పోవటం లేదు.

మీకందరికి తెలుసు. ధ్రువుడు ఐదు సంవత్సరముల బాలుడు. అతనికి ఏమాత్రము ప్రపంచ జ్ఞానము లేదు. లౌకిక జ్ఞానము లేదు. అలాంటివాడు విశ్వాసము చేత, నారదుని ప్రోద్బలముచేత కారడవులలో ప్రవేశించి కఠినముగా కూర్చొని భగవంతుని చింతించాడు. పెద్దల మాటలు మనం విశ్వ

పించాలి. బ్రహ్మమానస పుత్రుడు నారదుని మాటలు చక్కగా విశ్వసించాడు హృదయ పూర్వకంగా ధ్రువుడు. ఆ విశ్వాసమే అక్కడ సాక్షాత్కారంగా వచ్చింది. కాని బాలుడు లౌకికము తెలియని వాడు. విష్ణువు వచ్చి 'నాయనా! నీకేమి కావాలి?' అని ప్రశ్నించాడు. బాలుడైన ధ్రువుడు నేను ఎక్కడ ఉన్నానో ఏ విధంగా ఉన్నానో అది తెలుసుకున్న మీరు ఇంత కారడవి లోపల నేను కూర్చున్న స్థానమునకే మీరు వచ్చారు. నేను ఏమి చింతిస్తున్నాను అనేది మీకు తెలుసు. ఏమి కావాలో తెలియదా మీకు. భగవంతునికి మాత్రం అంత తెలివి లేకుండా పోలేదు. మన అందరికంటె గొప్పగా చదువుకున్నవాడు భగవంతుడు. నాయనా! నీవు ఎక్కడున్నావో నాకు తెలుసు. నీ కోరిక ఏమిటో నాకు తెలుసు కాని నా పద్ధతి ఒకటి ఉంటున్నది. thought, word, action మూడు ఒక్కటి కావాలి. అప్పుడే నేను నీ అభీష్టము నెరవేర్చటానికి సిద్ధముగా ఉన్నాను. నీవు ఇంటి దగ్గర భగవంతుని ప్రార్థించి తండ్రి తొడపైన కూర్చునే వరము కోరటానని చెప్పావు చెప్పినట్లుగా తపస్సు చేశావు. తలచినట్లుగా తపస్సు చేశావు. ఆ సంకల్పమునకు తపస్సుకు తగిన మాటలున్నాయా లేదా పరీక్షించాలి! ధ్రువుడు చెప్పాడు, 'నేను గాజు ముక్క కోసం వెతుకుతూ వచ్చాను ఈ ప్రాపంచిక విషయ వాసనలో నేను తండ్రి తొడపై కూర్చోవాలనేది విలువ లేని గాజు ముక్క. కానీ నీ దర్శనం మాణిక్యముగా కనిపిస్తున్నది. గాజు ముక్కకై వచ్చిన నాకు ఇంత పెద్ద మాణిక్యము దొరకటం ఎంత అదృష్టము. నాకు ఇంక గాజు ముక్క అక్కర లేదన్నాడు. చక్కగా పల్కాడు భగవంతుడు అక్కడ 'నాయనా! సంకల్పించటము, ఆచరించటము రెండు ఒకటైనాయి గానీ కోరటం మరొకటి కోరుతున్నావు. ఈ మూడింటిలో రెండు ఒకటిగా చేరాయి. ఒకటి వేరైంది. రెండున్నదే మెజారిటీ. కాబట్టి తిరిగి రాజ్యము ఏలుకోమని పంపించాడు. ప్రతి భావమునకు భగవంతుడు త్రికరణ శుద్ధి కోరుతుంటాడు. thoughts, words, action ఒకటి కావాలి. అడగటం ఒకటి చేయటం మరొకటి అది సరికాదు. ఇంత గొప్ప సంకల్పము పొంది ఇంత తపస్సు చేసి కల్పకడపటికి సాక్షాత్ నారాయణమూర్తి ప్రత్యక్షమైనా పొందలేకపోయాడు. కారణం ఏమిటి? వాక్ దోషం చేతనే.

కనుక వాక్కును మీరు చాలా పవిత్రంగా ఉపయోగపెట్టుకోవాలి. వాక్కు మనస్సు యొక్క బిడ్డ. మనస్సు సంకల్ప వికల్పముల తో మాలిన్యం పొందినది. తల్లి భావము తో బిడ్డను లాలించాయి. న్యాయంగా చూస్తే మనస్సుకు బ్రహ్మ భావం రావాలి. రాలేదు. తండ్రి ఒకడైనప్పుడు కుమారుడు మరొకడు కావచ్చు. సంబంధము తండ్రి కుమారుడు. ప్రహ్లాదుడు గొప్ప భక్తుడు. హిరణ్యకశిపుడు మహా దుర్మార్గుడు. అలాంటి దుర్మార్గుని గర్భములో మంచి మాణిక్యము వంటి కుమారుడు పుట్టాడు. నారాయణ

20069608

ప్రియుడు ప్రహ్లాదుడు. నారాయణ ద్వేషి హిరణ్యకశిపుడు. రూప నామములను నమ్ముకున్నవాడు హిరణ్యకశిపుడు. నామరూపముల చేత మభ్యపడని వాడు ప్రహ్లాదుడు. నామ రూపములుండినప్పటికీ వాటిని పరిత్యాగము చేయాలి. ఏనాటికైనా దేహము త్యజించవలసినదే. దేహ భావము త్యజించవలసినదే. ఆలు బిడ్డలను వదులుటం కాదు. ఆస్తి పాస్తులను వదలటం కాదు. దేన్ని త్యాగం చేయాలి? మానవుని ఆవరించిన ద్వేష అసూయాదులను త్యాగము చేయాలి. ఈ మూడింటిని ఆవరించినది మానవత్వము. ఆవరించిన దానిని దూరము చేసుకుంటె ఆనందము ప్రాప్తిస్తుంది. కన్నును పొర వచ్చింది. పొర తొలిస్తే చాలు దృష్టి వస్తుంది. నీవు దృష్టిని ప్రత్యేకంగా సంపాదించుకో నక్కరలేదు. అదే రీతిగా హృదయంలో రాగ ద్వేష అసూయాదులు ఆవరించి ఉన్నాయి. వాటిని క్రమక్రమేణా వేరు చేయటము అదే త్యాగము. త్యాగమంటే ఆస్తిపాస్తులు త్యాగం చేయటం కాదు. దుర్గుణములను త్యాగం చేయాలి. దుర్గుణముల త్యాగము చేసుకున్నప్పుడు మనయందు ఆత్మతత్త్వము సులభంగా ఆవిర్భవిస్తుంది. అది నార్మలు. మానవత్వము మాధవుని నుంచి పుట్టినది. దైవము నుంచి వచ్చింది. దైవమునుండి వచ్చినప్పటికి దైవమునే మనము మరచిపోతున్నాము. మేఘములంతా సూర్యుని నుండే పుట్టాయి. ఆ మేఘములు తిరిగి సూర్యునే కప్పివేస్తున్నాయి. కానీ సూర్యుడు ఏమాత్రము వాటిపై ద్వేషము పూనలేదు. ఇవన్నీ కదలిపోయే మేఘములు. కాష్టిలో కదలిపోయే వాటిపై మనకెందుకు ద్వేషము. అదే విధముగా కొన్ని సమయములలో దుర్గుణములు దుర్భావములు ఆవిర్భవిస్తుంటాయి. ఆవిర్భవించి ప్రకాశించే ప్రేమ తత్త్వాన్ని కొంత మరుగు చేస్తుంటాయి. అప్పుడు శాంతి వహించాలి. శాంతిగా ఉంటే ఆవరించిన మేఘములు కదలిపోతాయి. ఏ గాలి ద్వారా మేఘములు ఇక్కడకు వచ్చినాయో ఆ గాలి ద్వారానే మేఘములు ఇక్కడనుంచి కదలిపోతాయి. మేఘములు ఇక్కడకు రావటానికి, ఇక్కడనుండి కదలిపోవటానికి పెనుగాలియే ప్రధానము. ఆ పెనుగాలియే మన ప్రేమ తత్త్వము. ఆ ప్రేమ అనే గాలి వీచినప్పుడు ఈ మేఘములు పరుగెత్తుతాయి. ఆవరించిన మేఘములు కదలిపోతాయి.

ప్రేమకు అసాధ్యమైన కార్యము ఈ జగత్తులో లేనే లేదు. దేని చేత సాధించలేకపోవచ్చు కానీ ప్రేమ చేత సాధించలేనిది ప్రకృతిలో లేదు. సర్వము ప్రేమ చేత సాధించవచ్చు. 'ప్రేమ ఈశ్వర్ హై ఈశ్వర్ ప్రేమ హై'. పరమాత్మయే ప్రేమ, ప్రేమయే పరమాత్ముడు. ఈ రెండింటి ఏకత్వము మనము జాగ్రత్తగా గుర్తించాలి. ఈ ప్రేమ తత్త్వాన్ని మనము పెంచుకోవాలి. నీ బాధలు నీకు ఎంత ఇదో అదే విధముగా ఇతరుల బాధలని విశ్వసించాలి. నీపైన నీకు ఎంత ప్రేమయో వారిపైన కూడా వారికి

అంత ప్రేమ ఉంటుందనే సత్యాన్ని గుర్తించాలి. ప్రతి ఒక్కదానికి నిన్ను నీవు పోల్చుకోవాలి. అదే Self-Enquiry. తనకు ఎన్ని కాళ్ళున్నాయి ఎన్ని చేతులున్నాయని చూచుకోటం కాదు. తన భావము ఎట్టిదో పరుల భావము కూడా అట్టిదే. నా బాధలు ఎట్టివో పరుల బాధలు అట్టివే. నా విచారము ఎట్టిదో పరుల విచారము అట్టిదే. నా ప్రేమ ఎంత పరిశుద్ధమో పరుల ప్రేమ అంత పరిశుద్ధమే. ఇవి అన్నింటిని పవిత్రమైన ప్రేమతో పోల్చుకుంటూ రావాలి. అప్పుడు ద్వేషమునకు అవకాశమే లేదు. ఇంక అసూయకు ఇవతో స్థానము లేదు. ఈ రాగద్వేష అసూయాదులు దూరము గావించుకోవాలంటే నిశ్చలమైన ప్రేమను, నిస్వార్థ ప్రేమను, నిరహంకారమైన ప్రేమను మనం అభివృద్ధి పరచుకోవాలి. ఇదే నిజమైన భక్తి. అంతేగాని పూజలు చేయటము, జపములు చేయటము, ధ్యానము చేయటము ఇవన్నీ కేవలము మనస్సు యొక్క చంచలత్వమును తగ్గింపచేసే సోపానములు. ఒక మిద్దెను ఎక్కాలంటే నిచ్చెన వస్తాము. నిచ్చెనకు భూమి ఆధారము. పైన మిద్దెను ఆని ఉండాలి. అప్పుడే మధ్యనున్న మెట్లను మనం వాడుకో వచ్చు. క్రిందనున్న ఆధారమే విశ్వాసము. ఆ విశ్వాసముపై ఈ నిచ్చెన ఆధారము చేసుకోవాలి. పైన మిద్దెను అనుకొన్నదే ప్రేమ. ప్రేమ విశ్వాసములు రెండు ఉండినప్పుడు మనం ఎంతపైకైనా వెళ్ళిపోవచ్చు. ఈ రెండు లేక మనము నిచ్చెన ఎక్కలేము. ఒక వేళ ఆవిధంగా నిచ్చెన ఎక్కాలనుకుంటే అది అసాధ్యము. ఆధారము, ఆధేయము రెండు ఉండాలి. గాఢ విశ్వాసము ఉండాలి. పవిత్రమైన ప్రేమ ఉండాలి. ఈ రెండింటిని మనం సంపాయించుకుంటే ఏ జపధ్యానములు మనం చేయనక్కర లేదు.

ఈ జపధ్యానములు దేని కోసమని ఈ రెండింటిని పొందే కోసమే. ఆ రెండు ప్రాప్తించిన ఇంక జపధ్యానములు మనకెందుకు. దేనిని వెదకాలని పోతున్నావో అది నీ కాలికి తగిలినప్పుడు ఇంక వెతకనక్కరలేదు. చాలామంది దైవాన్వేషణ అనుకుంటూ ఉంటారు. ఎక్కడ చూచినా ఉండే భగవంతుని వెతికేది ఎందుకు. మొట్టమొదట నిన్ను నీవు వెతుకుతున్నావా ఎక్కడైనా? నిన్ను నీవు ఎక్కడా వెతకనక్కర లేదు. నిన్ను నీవు వెతుకుతున్నావంటే నీవు పిచ్చివాడవే. అదే రీతిగా భగవంతుని వెతకటమంటే నిన్ను నీవు వెతుక్కోటమే. భగవంతుడు నీ వెంటనే, నీ ఇంటనే, నీ జంటనే, నీ కంటనే ఉంటున్నాడు. నీవే భగవంతుడు. కేవలము దేహాభిమానము పురస్కరించుకొని, ఈ ఉపాధులను పురస్కరించుకొని నేను ఫలానా వాడినని చెప్పుకుంటున్నావు. అది కాదు. అనేక మంది మహర్షులు అనేక వేదశాస్త్ర ఇతిహాస పురాణములలో అన్ని ప్రశ్నలలో నేను ఎవరు అనే ప్రశ్న చాలా పెద్దది. తెలుసుకోటానికి ఈ జగత్తులో ఎన్నో పదములుంటున్నాయి. కానీ అన్నింటిలో 'నేను ఎవరు' అని తెలుసుకోవటంలో

ఏమి అర్థముంటున్నది. ఎవరైనా వచ్చినారంటే ఎవరండి మీరు ఎక్కడనుండి వచ్చారు అని మనము ప్రశ్నిస్తాము. అందరిని ప్రశ్నిస్తున్నావుగాని నీవు నేనెవరు, నేను ఎక్కడనుండి వచ్చాను అని నిన్ను నీవు ప్రశ్నించుకోటం లేదు. నిన్ను నీవు ప్రశ్నించుకుంటే ఇతరులంటే ఎవరో నీకు సులభంగా తెలిసిపోతుంది. దీనికి ఏమి కావాలి? మొట్టమొదట confidence కావాలి. confidence వలనే satisfaction వస్తుంది. ఈ satisfaction వలనే sacrifice చేస్తావు. ఈ sacrifice వలనే realisation చేస్తావు. మొట్టమొదట self confidence foundation., self satisfaction-wall, self sacrifice-roof., self realisation-life. పునాది లేక గోడ కట్టుటానికి వీలు లేదు. గోడ లేక roof వేయటానికి వీలు కాదు. roof లేక మనము నివసించలేము. self confidence ఏమాత్రం చలించకుండా చూచుకోవాలి. ఎలాంటి పరిస్థితి లోనైనా ప్రాణము పోయే పరిస్థితి అయినా చలించకుండా ఉండాలి. అంత గాఢమైన విశ్వాసము పెంచుకోవాలి. ఆ విశ్వాసము పెంచుకున్నప్పుడే మనకు తెలియకుండా ఆనందము ఆవిర్భవిస్తుంది. ఈ ఆనందము ఆవిర్భవించిందా సర్వము త్యాగము చేస్తావు. ఆనందములో నాదినాది అని ఏమాత్రము భేదము ఉండదు. అప్పుడే అన్నింటిని త్యాగము చేస్తావు. త్యాగము ఎంత ఆనందము నిస్తుంది! కాని మనం చేయలేక పోతున్నాం. కారణం ఏమిటి?

అభిమాన మమకారములు రెండు కట్టివేశాయి. ఈ రెండే మనలను నరకమునకు తీసుకు పోతున్నాయి. అందుకోసమే ఎవరో చెప్పారు. ప్రతివ్యక్తిని యమ ధర్మరాజు పాశము వేసి తీసుకుపోతున్నాడని. భగవంతుడు ఇన్నివిధములుగా సృష్టించినప్పుడు యమ ధర్మరాజు పాశం వేసి తీసుకు వెళ్లిపోతున్నాడే. ఇన్ని ప్రాణములు తీసుకు పోవటానికి యమ ధర్మరాజు rope factory ఎక్కడ పెట్టాడు. ఈ rope factory ఎక్కడా లేదు. ఎక్కడనుండి తీసుకు రానక్కర లేదు ఈ పాశములు. అభిమానము ఒకటి మమకారము ఒకటి ఈ రెండింటిలో బాగ కట్టివేస్తున్నాడు. ఈ అభిమాన మమకారములే మన గొంతునకు ఒక పాశముగా తయారౌతున్నాయి. ఇదే కాలము సంతృప్తిగా విస్తుంది. మనము దైవము ఎక్కడనుండో కష్టము లందిస్తున్నాడని, సుఖములు ఇస్తున్నాడని భావించరాదు సుఖదుఃఖములు మన సంకల్పముతో మూల కారణము. మంచి చెడ్డలకు మన సంకల్పముతో మూల కారణము. ఎవరో మనకు కారణము కాదు. వారి వల్ల మనకు ఈ కష్టములు లభించాయి, వారి వల్ల మనకు కష్టములు లభించాయి అనుకోటం పొరపాటు. మంచి చెడ్డలకు మనమే కారణము. సుఖదుఃఖములకు మనమే కారణము. నిందాస్తుతులకు మనమే కారణము. అన్నింటికి మనమే

కారణము. మనమే కారణమనుకున్నప్పుడు దేనికి భయము ఉండదు. ఎవరితోనో మనకు సుఖము కష్టము లభిస్తుందంటే భయము ఉండాలి. నిర్భయం ఎప్పుడు వస్తుంది. పరిపూర్ణ ప్రేమ ఉన్నప్పుడు నిర్భయము వస్తుంది. దోషములుండినప్పుడే భయము ఆవరిస్తుంది. మనసు దోషములకు ఏమాత్రము అవకాశము ఇవ్వకూడదు. సాధ్యమైనంత వరకు ఏ చిన్నపని చేసినా is it good or bad అని discrimination చేయి. టైము తీసుకో తొందరపడవద్దు. haste makes waste waste makes worry. so do not be in a hurry. ఏది వచ్చినా శాంతముగా ఉండు. దైవమును స్మరించు. దైవప్రేమ పెంచుకో. ఆ ప్రేమయే నీకు అమృతంగా మారిపోతుంది. దుఃఖమును దూరము చేస్తుంది. ఆనందము చేకూరుస్తుంది. ఇదియే మనం నిజంగా నేర్చుకోవలసిన చదువు. లౌకిక చదువులు చదవవచ్చు. ఇవి ప్రాకృత విద్యలే. ప్రవృత్తి మార్గములో మనము జీవించటానికి ఆధారము ఇవి. 'ఇహమునను సుఖింప హేమతారకవిద్య, పరమున సుఖింప బ్రహ్మవిద్య'. ఈ రెండు విద్యలు ఉండాలి. ఇవి నెగెటివ్, పాజిటివ్ వంటివి. ప్రాకృత విద్యలన్నీ నెగెటివ్. మన హృదయము నిండుగ నెగెటివ్ విద్యలు నింపుకున్నాము. కానీ ఆశించేది పాజిటివ్. అసాధ్యము. కారణం ఏమిటి? నెగెటివ్ నింపుకుంటున్నాము మనము. పాజిటివ్‌ను ఎట్లా కోరటానికి వీలవుతుంది. నీకు అధికారము లేదు. నీవు మొట్టమొదట హృదయములో పాజిటివ్ నింపుకో అప్పుడు అన్నీ లభిస్తాయి. ఈ ప్రకృతి విద్యలు ప్రకృతికి సంబంధించినవి. పరతత్త్వమునకు సంబంధించినదే బ్రహ్మవిద్య. దానికి ఎట్టి అభ్యంతరములు లేవు. ఈ రెండింటికి మధ్యలోనే మన జీవితము ప్రవేశించాలి.

విద్యార్థులారా! మీరు చాలామంది foot ball ఆడుతుంటారు. దీనికి ఒక system ఉంటున్నది. అటువైపు ఆరుమంది ఇటువైపు ఆరుమంది ఉంటారు. చివర రెండు పోల్సు పెట్టి ఉంటారు. ఇక్కడ ఒక పరిమితము అక్కడ ఒక పరిమితము పెట్టుకుంటారు. ఈ రెండింటి మధ్యలో పోయినప్పుడు గోల్ అవుతుంది. కామ క్రోధ లోభ మద మాత్సర్యములు ఆరుమంది ఒకవైపు ఉంటున్నారు. సత్యధర్మశాంతి ప్రేమ అహింస ఒకవైపు ఉంటున్నారు. వారు వీరు life అనే బాలును కొడుతున్నారు. ఇహవిద్య, పరవిద్య ఇవే limits. ఈ రెండింటి మధ్యలో life అనే బాల్ కొడితే గోల్ అయిపోతుంది. అటువైపుగానీ ఇటువైపుగానీ పోతే అవుట్ అవుతుంది గానీ గోల్ కాదు. ప్రాకృత విద్యలు చదవండి. వీనిలో కూడా ఉన్నతస్థితి పొందండి. కాని దీనిని ఆధారము చేసుకొని దివ్యమైన విద్యకూడను మీరు నేర్చుకోవాలి. అధ్యాత్మ విద్యా విద్యానాం. లౌకిక విద్యలన్నీ చిన్న చిన్న నదులవంటివి, కాలువల వంటివి.

అన్ని చేరేది సాగరము. ఆధ్యాత్మ విద్య సముద్రము వంటిది. నదులన్నిటికి సాగరమే గతి. మీరు ఎన్ని
విద్యలు నేర్చినా కట్టకడపటికి అనుగ్రహమన్న సాగరములో చేరక తప్పదు. ఆ విశ్వాసము చేత, ఆవిధ
మైన ప్రయత్నము చేత ఈ ప్రేమ తత్త్వాన్ని పెంచుకోండి. ప్రకృతిని మనము ఏమాత్రము విసర్జించ
కూడదు. ప్రకృతిని మనము ఏమాత్రము వదులుటకు వీలుకాదు. ఇది కూడ భగవత్స్వరూపమే. ఈ
ప్రకృతి కార్యస్వరూపము. పరమాత్మ కారణము. కారణ-కార్య సంబంధమే ప్రపంచము. అందులో కూడ
దైవత్వము మీరు చూడాలి. అణువణువునందు దైవత్వమును మీరు పరికించవచ్చు. కాన కేవలము
లౌకిక విద్యలతో మన జీవితాన్ని అంత్యము గావించకూడదు.